# అంతిమ గీతం

వులాపు బాలకేశవులు




ఆరంభం యిదే.. అంతమూ యిదే.. పార్వతి ఆలోచిస్తోంది. ఆమె చేతిలో నోట్లు ఎండుటాకుల్లా పరపరలాడుతున్నాయి. ఆ రోజు కూడా యిలాగే జరిగింది. బి.ఏ. రిజల్ట్సు వచ్చాయి. న్యూస్ పేపర్ ఎండుటాకులా పరపరలాడింది. అయినా ఆ కుర్రాడు అయ్యేయస్ అని మామయ్య నుండి ఉత్తరంరాగానే ఫోటో చూసి తను ఊ అనేసింది.

ఫారన్ రిటర్న్డట. మా పారూ ఎంత అదృష్టవంతురాలో. అమ్మా నాన్నల ఆనందానికి అవధులు లేవు. జీవితం పరీక్ష. రాసిన వెంటనే పాసయిపోయినట్లు అనిపించింది వాళ్ళకి. తనుకూడా చాటుగా ఆ వుత్తరం చదివింది. శరీరం ఏళ్ళ తరబడి ప్రశాంతంగావున్న చెరువులో ఎవరో ఏదో విసిరేసినట్టు అలజడి పడుతోంది. అవును. ఆరంభం యిదే... అంతమూ యిదే..

పెళ్ళి రోజులు దగ్గరికి వచ్చేశాయి. నాన్న ఏర్పాట్లలో మునిగిపోయారు. మీ ఆరోగ్యం కొంచం చూసుకోండి.. అనేది అమ్మ. నాన్న నవ్వేసేవారు. నా పనేగా చేస్తున్నాను? పారు నా ఒక్కగా నొక్క బిడ్డ. అయ్యేయస్ దగ్గరికి వెడుతోంది. ఏదె టొచ్చినా నాకే చెడ్డ పేరు.. అనేవాడు నవ్వుతూనే. నిజంగా నాన్న ఏ లోటూ రానివ్వలేదు. అంతా పకడ్బందీగా జరిగింది. పెళ్లి వారు చాలా సంతోషించారు. నాన్న కూడా ఎంత ఆనంద పడ్డారో!

వీడ్కోలు రోజున నాన్న ఉదయం నుంచీ కనిపించలేదు. ప్రయాణ సన్నాహాలు పూర్తి అయ్యాయి. తను మెల్లిగా పూజ గదిలోకి అడుగుపెట్టింది. నాన్నకి ఏ మాత్రం దుఖం కలిగినా ఇక్కడే కూర్చుని భగవంతుని వేపు రెప్పవాల్చకుండా చూస్తూవుండిపోతారని తనెరుగును. అంతా వైభవంగా జరిగింది. పంపేటప్పుడు కూడా నిండు మనస్సుతో ఆశీర్వదించండి.. అంది అమ్మ. నాన్న వెనక్కి తిరిగారు. ముఖం బాష్పధారతో తడిసిపోయివుంది.

సావిత్రీ! పారూ పుట్టినప్పుడు నేను ఎంత సంబరంగా అన్నీ చేసానో గుర్తులేదూ? ఉయ్యాల, పాలసీసా, బొమ్మలూ.. అలాగే ఈ ఇంటి నుంచి వెళ్ళేటప్పుడు కూడా అన్నీ చేశాను. కానీ రాడానికీ, పోడానికీ మధ్య యింత వ్యత్యాసం వుంటుందని నేనెప్పుడు అనుకోలేదు. ఆయన చంటి కుర్రాడిలా వెక్కి వెక్కి ఏడ్వసాగాడు. అమ్మ ఆయన దగ్గరగా వెళ్ళింది చెంగుతో కళ్ళు వత్తుకుంటూ. అవును, సంతానం కలిగేటప్పుడు తల్లి బాధతో మూలుగుతుంది. అది అందరికీ వినబడుతుంది. కాని కనిపెంచిన పిల్ల పరాయి యింటికి వెళ్ళిపోతుంటే తండ్రి దుఖం అంతా యింతా కాదు. అది ఎవరూ అర్థం చేసుకోలేరు. ఇలా ఎందుకు జరుగుతుందండీ! ఎందుకు జరుగుతుంది?

అమ్మ ఏడ్వసాగింది. నాన్న కళ్లెత్తి చూసారు. లేచి నా దగ్గరగా వచ్చారు. పారూ! నువ్వు అంతా

చూడ్డం మంచికే జరిగింది. ఇదే నా ఆశీర్వాదం అనుకో. మగాడు పదిమందిలోనూ పగలబడి నవ్వి ఇంట్లో మాత్రం ఏకాంతం వెదుకుతూంటే అంతులేని బాధలో వున్నాడని తెలుసుకోవాలి. గుర్తు పెట్టుకో. అలాంటి మగాడి మీద రోషం చూపించకూడదు. జాలి చూపించాలి. ఆ రోజు తను కేవలం విన్నది కాని, యిప్పుడు తెలుసుకుంది. ఆరంభమూ యిదే.. అంతమూ యిదే.. అని నాన్న మరో విధంగా మాటలలో చెప్పారని.

* * *

తను పాట్నా వచ్చేసింది. ప్రతి సాయంత్రం ముస్తాబై భర్తతో క్లబ్బుకి వెళ్లేది. రెండు పెగ్గులు వేసుకుని అతను విరగబడి నవ్వుతుంటే తను లోలోపలే కంపించి పోయేది. అర్ధరాత్రి తరువాత ఇంటికి చేరేవాళ్ళు. మీద గది తమది. నీతూ, వివేక్‌లు ప్రక్క గదిలో నిద్రపోతూవుండేవాళ్ళు. పిల్లలిద్దరి మధ్యకు వెళ్ళి పడుకోవాలనిపించేది తనకి. కాని అలా చెయ్యలేకపోయేది. ఒక్కచూపు పిల్లలమీదికి విసిరేసి భర్త దగ్గరికి వచ్చేసేది. మరుక్షణం అతను తనని ఆక్రమించుకునేవాడు. నోరు విస్కీ కంపు కొట్టేది. కొద్ది కొద్దిగా ఆ మత్తు తన శరీరంలోకి దిగిపోయేది. ఇలాంటి మగాడి మీద రోషం చూపించాలో, జాలి చూపించాలో తనకి అర్థమయ్యేది కాదు.

"..మమ్మీ! నువ్వు నా చేత హోం వర్కు చేయించడం లేదు. రిజల్టు బాగుంటే మాత్రం ప్రోగ్రెస్ కార్డు చూసి.. గుడ్.. అని వూరుకుంటాడు డాడి. బాగోలేకపోతే తిట్టిపోస్తారు. మధ్యలో నేనేం చెయ్యాలి మమ్మీ?" అంటూ ఉదయం ఫిర్యాదు కొచ్చేవాడు వివేక్. నీతూ ఏమీ అనదు. ఒకే ఒకసారి భయం భయంగా అంది - "మమ్మీ నువ్వు నాతో పడుకోవెందుకూ? నాకు భయం వేస్తోంది" అని. తను నిరుత్తురురాలయింది. హృదయాంతరాళా లలో తనకి ఏదో భయంగా వుండేది. కాని ఈ రోజు అనిపిస్తోంది తనకి- ఆరంభమూ యిదే.. అంతమూ యిదే.. అని.

* * *

అప్పటికి ఇంకా పిల్లలు పుట్టలేదు తనకి. "ఇది ఇంటి ఖర్చుకి.. ఇది నీకు..." జీతం చేతిలో పెడుతూ అన్నారాయన.

"ఏమిటి?"

"వందనోటు?"

"...ఎందుకు?"

"...నీ సేవకి బక్షీస్..." అట్టహాసంగా నవ్వేరాయన.

తను ఆపాదమస్తకం వణికిపోయింది. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"...అరె! ఏమయింది?"

"...ఎప్పుడైనా నేను సేవ చెయ్యలేకపోతే?"

"... అప్పుడు కూడా యిలాగే ఇస్తుంటాలే. ఇది పాకెట్ మనీ, కేవలం ఖర్చుకి."

తను శిలా ప్రతిమలా నిలబడిపోయింది.

".... ఈ డబ్బు యింటికి కాని, నాకు గాని ఖర్చుపెట్టనని మాటయివ్వు. నీకే ఖర్చు పెట్టుకోవాలి. నా సంపాదనలో నీకు కొంత భాగం మీద పర్సనల్‌గా హక్కువుంది. అందుకే యిది నీ కోసం అంటున్నాను..." నన్ను కౌగిలిలోకి తీసుకుంటూ అన్నారాయన. తరువాత పిల్లలు పుట్టారు. వాళ్ళకి పాకెట్ మనీ యిచ్చాక ఓ వంద నోటు తనవేపు చాపేవారు.. యువర్ పాకెట్ మనీ.. అంటూ. ప్రతినెలా ఈ తంతు జరిగేది చాలాకాలం. కాని ఓ రోజు ఆయన ఆఫీసుకి వెళ్ళిపోయాక స్కూలుకి తయారవుతూ వివేక్ వచ్చాడు. వాడి చేతుల్లో కొన్ని కరెన్సీ నోట్లు ఉన్నాయి.

"..ఏమిటి విక్కూ?"

వాడు మౌనంగా మాటలు వెతుక్కుంటున్నాడు. అనుకోకుండా వాడు ఆ నోట్లు నేలకేసి కొట్టాడు. " ఆఫ్టరాల్ అయామ్ యువర్ సన్ డాడీ సన్. నౌకర్ని మాత్రంకాదు. నెలనెలా పాకెట్ మనీ పేరుతో జీతం యిస్తున్నారు. అయ్ హేట్ దిస్ మనీ. నీతూ నువ్వు కూడా పారెయ్ ఆ డబ్బు..." నీతూ నిశ్శబ్దంగా నిలబడిపోయింది. వివేక్ దాని చెంప చెళ్ళుమనిపించాడు. "నువ్వుకూడా మమ్మీలాగే స్లేవ్ అయిపో..." వాడు ఉద్రేకంగా అంగలు వేసుకుంటూ వెళ్ళిపోయాడు. వాడి వెనకాలే ఏడుస్తూ వెళ్ళిపోయింది నీతూ.

తను దోచుకోబడ్డ దానిలా అలా నిలబడిపోయింది. కళ్ళముందే వివేక్ ఎంత ఎదిగిపోయాడు! అంతా ఆలోచిస్తున్నాడు. తెలుసుకుంటున్నాడు. కాని, తనకి మాత్రం భర్త, పార్టీలూ, క్లబ్బులనే ప్రహారీలో ఏమీ తెలీలేదు. మంచం మీద బోర్లాపడి ఏడవసాగింది తను. అప్పుడే మంచం మీది కూడా నోట్లు ఉన్నట్లు తనకి తెలిసింది. వాటితో ఓ స్లిప్ కూడా వుంది. - విత్ థాంక్స్ టు మమ్మీ అండ్ డాడీ - నీతూ. నీతూ యొక్క ముద్దులొలికే రాతను మరీ మరీ ముద్దు పెట్టుకుంటూ ఏడవసాగింది తను. కాని ఈ రోజు అనిపిస్తోంది తనకి బహుశా ఆరంభమూ యిదే... అంతమూ యిదే...

* * *

ఆ రోజు సాయంత్రం తను క్లబ్బుకి వెళ్ళలేదు. ఆయన ఒక్కరే వెళ్ళారు. పిల్లలు చదువుకుంటుంటే తను దగ్గరకు వెళ్ళింది. నీతూ, "రా... ఇవ్వాళ నీ చేత హోంవర్క్ చేయిస్తాను." నీతూ నిర్నిమేషంగా చూడసాగింది.

"అలా చూస్తావేమ్మా?"

"ఇవ్వాళ క్లబ్బుకెళ్ళలేదా మమ్మీ?"


"ఇంకెప్పుడూ వెళ్ళనమ్మా!"

"మరి పార్టీలకి?"

"అక్కడికి కూడా వెళ్ళను."

నీతూ వెంటనే లేచి తల్లి మీద పడి హత్తుకుపోయింది.. "అయితే ఇవాళ మేం చదువుకోం... మమ్మీతో కబుర్లాడుకుంటాం..." అని తనని తన గదిలోకి జబర్దస్తీగా లాక్కుపోయింది. మంచంమీద కూర్చోబెట్టి రకరకాల స్కూలు సంగతులు చెప్పసాగింది. రెండు మూడేళ్ళ క్రితానివి కూడా. అప్రయత్నంగా తనకళ్ళు చెమర్చాయి. ఇన్నేసి చెప్పాలనుకుంటోందా తనతో! ఇన్నేళ్ళూ తను వినలేక పోయింది. ఇంతలో వివేక్ ఇంక్ కోసం ఆ గదిలోకి వచ్చాడు... "ఏరా వివేక్ నువ్వేమీ చెప్పవా?" అడిగింది తను.

"... మమ్మీ చెప్పాల్సినవి చాలా వున్నాయి. కాని మాకోసం కూడా నీకు టైము



దొరుకుతుందనే నమ్మకం లేకుండా పోయింది. అందుకే ఏమీ జ్ఞాపకం వుంచుకోలేదు." అని వాడు గది బయటకు వెళ్ళిపోయాడు. తను నీతూని పట్టుకుని ఏడ్వసాగింది. ఆరంభం ఇక్కడనుంచేనా... మరి అంతం..?

* * *

కాలచక్రం సంవత్సరాల శరీరాలు చీల్చుకుంటూ ముందుకి సాగిపోయింది. ఆయన ఒక్కరే క్లబ్బుకి వెళ్ళి వచ్చేవారు. బాగాతాగి ఏవేళకో కింది గదిలో నిద్రపోయేవారు. ఒక్కోసారి ఇంటికి వచ్చేవారు కాదు. క్లబ్బులో ఎవరో ఒకావిడతో ఏదో వుందని పుకారు. విని కూడా తను వూరుకుంది. ఆయన రాని రోజు మాత్రం రాత్రంతా చికాకుగా గేటు దగ్గరికీ యింట్లోకీ తిరుగుతూండేది తను. అప్పుడూ కిటికీకి జారబడి ఎన్నోసార్లు వివేక్ సిగరెట్ కాల్చటం చూసింది తను. వాడి చేతి నుంచి సిగరెట్టు లాగి విసిరేసే సాహసం తనకి కలగలేదు.

"...రాత్రంతా నిద్రపోలేదా విక్కూ!" వాడి ఎర్రటి కళ్ళు చూసి ఉదయం అడిగేది తను.

"...రాత్రంతా చదువుతూనే వున్నా.. మమ్మీ ఎప్పుడు చూసినా నీ కళ్ళు కూడా ఎర్రగానే వుంటున్నాయి.. ఏ డాక్టరుకన్నా చూపించుకో కూడదా?" తిరిగి అనేవాడు వాడు.

"బాబూ మీ మమ్మీకూడా ఓ పరీక్షలో చిక్కుకుంది. ఆడది ఎంచుకుంటే ఎవర్ని ఎంచుకోవాలి? భర్తనా... పిల్లల్నా? అనే ప్రశ్నకు నువ్వేదైనా సమాధానం చెప్పగలవా నాయనా?" అని అడగాలనిపించేది ఆ క్షణంలో ఆమెకి. కాని నోరు తెరవలేకపోయేది.

రాను రాను ఎన్నో మార్పులు సంభవించాయి. నీతూ పెద్దదయింది. ఒకే ఒక విషయంలో మార్పు రాలేదు. ప్రతినెలా పిల్లలకు పాకెట్ మనీ, తనకో వంద నోటు... ఎన్నోసార్లు ట్రాన్స్‌ఫర్లు అయ్యాయి. అన్నిసార్లు ఆయన పాట్నా తిరిగి వేయించుకునేవారు. కాని ఇంటికి తిరిగి వచ్చినా తిరిగి రానట్లే. తిరిగి రావడం తన గదిలో తానుండడం... "అప్పుడప్పుడు యింట్లో వాళ్ళ కోసం కూడా కాస్త టైం స్పేర్ చేస్తూ వుండండి." ఓ రోజు సాహసించి అడిగింది తను.

"టైము ఎక్కడ వుంటోంది. ఉద్యోగం చూసుకోనా? కెరీర్ చూసుకోనా? ఇల్లు చూసుకోనా? ఏ స్కూలు మాస్టర్నో, వ్యాపారస్తుణ్ణో చేసుకుంటే అయిదు గంటలకి ఇంటికి వచ్చేసి అంటిపెట్టుకు వుండిపోను. అయ్యేయస్సు కావాలి! కారు కావాలి! బంగళా కావాలి! ప్చ్ నువ్వు అడ్వాన్స్ కాలేదు. పిల్లల్నీ కానివ్వలేదు. ఫారెన్ వెళ్ళి చూడు. పిల్లలు ఎంత ఇండిపెండెంటుగా ఎదుగుతారో? అంతా నాశనం చేశావు".

ఈ మగాడి మీద రోషం చూపించాలో జాలి చూపించాలో అర్థం కాలేదు తనకి. అంతే ఆనాటి నుంచీ తను శాశ్వతంగా నోరు మూసేసుకుంది. వివేక్ ప్రయత్నం వల్ల నీతూకి పెళ్ళి నిశ్చయమైంది. అన్ని ఏర్పాట్లు తనే చేశాడు. ఆమె అత్తవారింటికి వెళ్ళే రోజున మాత్రం వాడు ఎక్కడా కనిపించలేదు. ప్రయాణ సన్నాహాలు పూర్తయాయి. ఆయన బయట నిలబడ్డారు ఆశీర్వదించి పంపించడానికి. ఆలస్యమైపోతోంది. ఆయన కేకలేస్తున్నారు. "నీతూని త్వరగా

### ప్రేక్షకుల టేస్ట్ అలా ఉంది!

బాలీవుడ్ ఇండస్ట్రీలో తొలి చిత్రంతోనే సంచలనం సృష్టించి శృంగార దేవతగా పేరు తెచ్చుకున్న మల్లికా షెరావత్ ప్రేక్షకులు తనను సెక్సీగా చూడాలనుకుంటున్నందుకు నేనేమీ సిగ్గుపడటం లేదు. క్యారెక్టర్‌ను బట్టి సినిమాలో ఎక్స్‌పోజింగ్ అవసరమైంది కాబట్టి చేశాను. ఇక ముందు కూడా నా క్యారెక్టర్‌కు తగినట్లుగా చెయ్యడానికి ఎలాంటి అభ్యంతరం లేదు. అయినా 'ఖ్వాయిష్'లో ఎంతో మంచి ఉంది. దాన్నంతా వదిలేసి అనవసరమైన టాపిక్ గురించే అందరూ మాట్లాడుకుంటున్నారు. నటిగా నాకు ఇమేజ్ ముఖ్యం అది ఎలాంటిదైనా సరే అంటోంది మల్లికా షెరావత్.



తీసుకురావోయ్! లేటైతే ట్రైన్ మిస్సవుతుంది. డోంట్ నోది వాల్యూ ఆఫ్ టైం". తను పరుగెత్తి నీతూ గదిలోకి వెళ్ళింది. అక్కడ లేదు. తరువాత పూజ గదిలోకి వెళ్ళింది. దేవుని విగ్రహం ముందు వివేక్ నిశ్శబ్దంగా కూర్చునివున్నాడు. అక్కడే నీతూ నిలబడివుంది. తన కాళ్ళు గుమ్మం దగ్గరే ఆగిపోయాయి.

"అన్నయ్యా! ఆశీర్వదించవా?"

వివేక్ తల తిప్పాడు. ముఖం బాష్పధారలతో తడిసిపోయివుంది. తనకి నాన్న రూపం గుర్తుకొచ్చింది. అమ్మ మాటలూనూ. సంతానం కలిగేటప్పుడు తల్లి బాధతో మూలుగుతుంది. అది అందరికీ వినబడుతుంది. కానీ కని పెంచిన పిల్ల పరాయి ఇంటికి వెళుతుంటే తండ్రి దుఃఖం అంతా ఇంతా కాదు. అది ఎవరూ అర్థం చేసుకోలేరు. ఇలా ఎందుకు జరుగుతోంది.

"ఆశీర్వదించడానికి బయట డాడీ వున్నారు నీతూ!"

"డాడీ, ఆయన అందరి ముందూ ఫార్మాలిటీకి నిలబడతారు. అందరి కోసం కంట తడి కూడా పెట్టవచ్చు. అయ్ హేట్ హిమ్. నువ్వు నాకు సోదర ప్రేమ పంచి పెట్టావు. పితృవాత్సల్యం చూపించావు. నాకు నీ ఆశీర్వాదమే కావాలి అన్నా!" నీతూ ఏడ్వసాగింది.

వివేక్ లేచి చెల్లెల్ని గుండెలకు హత్తుకున్నాడు. "నీతూ! నీ అన్నయ్యని మరచిపోకు. నువ్వు వెళ్లేది ఒక ఇంటి నుంచి కాదు. ఒక సత్రం నుంచి. ఈ సత్రంలో మళ్ళీ అడుగుపెట్టకు. ఉద్యోగం రాగానే నేనుకూడా ఈ సత్రాన్ని వదిలివేస్తాను". ఇద్దరూ ఒకర్ని పట్టుకుని ఒకరు ఏడవసాగారు. పార్వతి ఆ దృశ్యం చూడలేకపోయింది. మరొక్కమాటకూడా వినలేకపోయింది. పరుగెత్తి తన గదిలోకి వచ్చేసింది. మంచం మీద ఎన్నో నోట్లు పడి వున్నాయి. వాటితోపాటు ఒక స్లిప్పు- విత్ థాంక్స్ టూ డాడీ- నీతూ.

నీతూ సత్రం బిల్లు మొత్తం చెల్లించింది అనుకుంది తను. నెమ్మదిగా తన అల్మారా వేపు వెళ్ళింది. ఒక మూల ఎన్నో వంద నోట్లు పడివున్నాయి. తను వాటిని ఏమి చేయాలి? ఎవరికి తిరిగి యివ్వాలి? ఎలా ఇవ్వాలి? ఏడ్పు ముంచుకొచ్చింది. ఏళ్ళ తరబడి ప్రశాంతంగా వున్న చెరువులో ఎవరో ఏదో విసిరేసినట్టు శరీరం కంపించసాగింది. బహుశా... చివరి కొనవూపిరికిది కిరాయి. ఒక రోజున చెల్లించేయాలి. బహుశా అంతా ఇక్కడే ఆరంభం... అంతమూ ఇదే... *